విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, కార్యదర్శి కోట సురేష్‌బాబు ఆధ్వర్యంలో.. అంగన్వాడీ టీచర్లకు, కార్యకర్తలకు, హెల్త్ వెల్ఫేర్ సభ్యులకు గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆరోగ్య సమస్యలు - తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబు మాట్లాడుతూ... గ్రామంలో ప్రతి ఇంట్లో నీటి నిల్వలు లేకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు.,హెల్త్ వెల్ఫేర్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోలేరోను ఢీకొన్న లారీ - ఇద్దరి మృతి

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఆత్కూరు గ్రామం వద్ద ఫ్లైఓవర్‌పై ఆగిఉన్న బొలెరో వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టమాటా లోడ్‌లో వెళ్తున్న బొలెరో వాహనం టైరు పంచర్ అవడంతో రోడ్డు పక్కన ఆపి మరో డ్రైవర్ సాయంతో పంచర్ వేస్తున్నారు. ఇంతలో అతివేగంగా వస్తున్న లారీ బొలెరోను ఢీకొట్టింది. దీంతో బొలెరో డ్రైవర్ పల్లపు దుర్గారావు అక్కడికక్కడే మరణించారు. చికిత్స పొందుతూ మరో డ్రైవర్ మరణించాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన రిపోర్ట్ పై ఆత్కూరు యస్ ఐ పైడి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : ఈ నెల 27వ తేదీన పెనమలూరు మండ లం తాడిగడప- ఎనికేపాడు వందడుగుల రోడ్డు మార్గంలోని శ్రీచైతన్య కళాశాల ఎదు రుగా గల స్థలంలో నిర్వహించనున్న రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీ రావు సంస్మరణ సభ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం శ్రీచైతన్య కళాశాల మీటింగ్ హాల్లో అధికారులతో సమీక్షించిన అనంత రం ఏపీ సిఆర్డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ, ఏ అధికారులు ఏ ఏ బాధ్యతలు నిర్వహించాలనే విష యంపై ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఆ ప్రకారంగా ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ సభను విజయవంతం చేయాలని సూచించారు. ప్రధానవేదికతోపాటు, బ్యారికేడింగ్ పనులు పూర్తిచేసేలా ఆర్అండ్‌బి అధికారులు పర్యవేక్షించాలని, వేదికతో పాటు రామోజీరావు చిత్రపటాలకు పుష్పాలంకరణ, ఆవరణలో పారిశుధ్యం నిర్వహణ, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు, వేదికపై ఏసీలు, గ్యాలరీలలో కూలర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేదిక వద్ద లైటింగ్, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పవర్ బ్యాకప్ ఏర్పాటుచేయలని, ప్రధానవేదికవద్ద సీసీ టీవీ కెమేరాలు, ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, రామోజీరావు జీవిత విశేషాలతో ఫోటో ఎగ్జిబిషన్, ప్రధాన వేదిక బ్యాక్ డ్రాప్, డిజిటల్ స్క్రీన్, పీఏ సిస్టమ్ ప్రత్యేక ప్రసారం, ముఖ్యమంత్రితో పాటు అతిధులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమం రోజున వేదికపై శాస్త్రీయ సంగీతం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద సూచిక బోర్డులు, సంచార మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండాచర్యలు తీసుకోవడంతోపాటు ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా గట్టిపోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశానికి ముందు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సంపత్ కుమార్, విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కృష్ణా ఎస్పీఅద్నాన్ నయీమ్ అస్మి, సిఆర్డిఏ అదనపు కమిషనర్ అలీం బాషా, జి ఐ డి ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ వాణి,వివిధ శాఖల అధికారులతో కలిసిసభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖరరావు, అదనపు ఎస్పి ప్రసాద్, సమాచారశాఖ అదనపు డైరెక్టర్ ఎల్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు కిరణ్ కుమార్, టీ కస్తూరి, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కృష్ణారెడ్డి గుడివాడ, ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ల అధికారులు పి పద్మావతి, డి.రాజు, గుడివాడ, తాడిగడప మున్సిపల్ కమిషనర్లుసు బ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, ముడావీసీ వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

విశాలాంధ్ర-కూచిపూడి : ఒకపక్క డెంగ్యూ, మరొక పక్క వైరల్ జ్వరాలు ఇంకొక పక్క జిల్లాలో కొనసాగుతున్న డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్న ఈ తరుణంలో గ్రామ పంచాయతీలు పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ లను పారిశుధ్య కార్యక్రమాలు అమలుపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో పలు ప్రాంతాలలో పర్యవేక్షిస్తుండగా గ్రామాలలోని పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది చెత్తాచెదారం తొలగించడంపై దృష్టి సారించకపోవడం పట్ల ఆయా ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రెండు రోజుల క్రితం మొవ్వలో ఎండిఓ జి చంద్రశేఖర్ పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించి గ్రామాలలో ప్రబలుతున్న వ్యాధుల దృష్ట్యా వపారిశుధ్య కార్యక్రమాలను అత్యంతప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామాలను పరిశుభ్రతగా తీర్చిదిద్దాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇవేమీ తమకు పట్టనట్లు కొంతమంది పంచాయితీ సిబ్బంది ప్రవర్తించడం బాధ్యత రాహిత్యం గా ఉందని గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అలాగే రక్షిత మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేసేమంచినీటి విషయంలో కూడా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించినా కొన్ని ప్రాంతాలలో రంగు మారిన నీరే కుళాయిలద్వారా వస్తుందనే ఆరోపణ సైతం వినవస్తున్నాయి. దోమల ద్వారా వ్యాప్తి చెందే పలు వ్యాధుల పట్ల పంచాయతీ అధికారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని చేస్తున్న సూచనలు చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లుగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి శుద్ధి అమలుపై మంగళవారం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ స్వయంగా ఎనికెపాడు నుంచి తాడిగడప వరకు గల 100 అడుగుల రహదారి మార్గంలో ద్విచక్ర వాహనంపై పారిశుధ్య పర్యవేక్షణ చేసిన విషయన్ని సైతం వాట్సాప్ లలో హల్ చల్ చేస్తున్న విషయాన్ని పలువురు ప్రస్తావిస్తూ వారి కొన్న బాధ్యత పంచాయితీ అధికారులకు సిబ్బందికి ఉండదా??అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య అమలుపై, పరిశుభ్రమైన మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలని పేర్కొంటున్నారు.

వెంకయ్యనాయుడిని కలసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

విశాలాంధ్ర-గుడివాడ : భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును మంగళవారం ఢిల్లీలోని అయన స్వగృహంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాముతో కొద్దిసేపు వెంక య్యనాయుడుతో మచ్చటించారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ వ్యవహారాల గురించి చర్చించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసేలా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించాలని, గుడివాడ నియోజకవర్గంలోని, పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని, రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, అదేవిదంగా తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే రాముకు సూచించారు.

హోటళ్లపై విజిలెన్స్ దాడులు

విశాలాంధ్ర-గుడివాడ : గృహఅవసరాలకు వినియోగించే గ్యాస్ బండ్లను హోటల్స్‌లో వినియోగిస్తున్నట్లు తెలుసుకుని మంగళవారం విజిలేన్స్ అండ్ ఎన్‌ఫోర్సు మెంట్ అధికారులు పట్టణంలోని పలు హోటల్స్‌ను తనిఖీలు నిర్వహించి అక్రమంగా వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా విజిలేన్స్ సి.ఐ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లోని కరూర్ వైశ్యబ్యాంక్ ఎదురు గల లక్ష్మీ శ్రీనివాస టిఫిన్ సెంటర్‌లో అక్రమంగా గృహ అవసరాలకు వినియోగించే 6 గ్యాస్ బండ్లను సీజ్ చేయడం జరిగిందన్నారు. వీటిని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగబాబుకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ దాడులలో విజిలేన్స్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వ ఉన్నతాధికారులైన జిల్లా కలెక్టర్ తో చర్చించి త్వరలోనే ఆదిశగా చర్యలు చేపడతామని గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు రైతులకు హామీ ఇచ్చారు. అజ్జంపూడి, గన్నవరం, బుద్దవరం తదితర గ్రామాల నుండి విమానాశ్రయ విస్తరణ వలన భూములు కోల్పోయిన రైతులు సోమవారం సాయంత్రం యార్లగడ్డ వెంకట్రావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. గన్నవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయంగా అభివృద్ధి చేసేందుకు 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. దీనికోసం భూసేకరణ అనివార్యమైంది. గన్నవరం చుట్టుపక్కల గ్రామాల్లో విమానాశ్రయానికి ఆనుకుని దాదాపు 730 ఎకరాలు సమీకరించింది.ముందు తమ భూములు ఇచ్చేందుకు రైతులు వ్యతిరేకించినా విమానాశ్రయం అభివృద్ధికి ఇచ్చే భూములకు బదులు రాజధాని అమరావతిలో స్థలాలు కేటాయిస్తామన్న ప్రభుత్వ హామీతో భూములిచ్చారు. అమరావతి రైతుల తరహాలోనే కౌలు ఇచ్చి 1450 గజాల స్థలాన్ని అమరావతిలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. తదనంతరం ప్రభుత్వం మారడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సకాలంలో కౌలు డబ్బులు రైతులకు అందజేయలేదు, దీంతో రైతుల్లో మానసికంగా ఆందోళనలు చెలరేగాయి. రాజధానిలో భూములు కొందరికే రిజిస్ట్రేషన్ కావటం, ఇచ్చినవి ఎక్కడో స్పష్టత లేకపోవటం, రాజధాని మార్పు ప్రకటన వంటి అంశాలు భూ త్యాగం చేసిన అన్నదాతలను ఆందోళనకు గురి చేశాయి.రాష్ట్ర ప్రభుత్వం సమీకరించిన భూమి కేంద్రానికి అప్పగించటంతో విమానాశ్రయం అభివృద్ధిలో భాగంగా ఆ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. అటు సరైన పరిహారం అందక, ఇటు ఉన్న భూమిపై అధికారాన్ని కోల్పోయి ఆందోళన చెందుతున్న రైతులు సోమవారం యార్లగడ్డ వెంకట్రావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి ప్రభుత్వ ఒప్పందం మేరకు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఏదైతే ఒప్పందం కుదుర్చుకుందో ఆ ఒప్పందాన్ని అమలు చేసే విధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తదితర హామీలపై జిల్లా కలెక్టర్ తోచర్చిస్తామని త్వరలోనే భూములు కోల్పోయిన వారందరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్ విద్యార్థులను కోరారు. మంగళవారం ఎస్.వి.ఎల్ విద్యా సంస్థలలో పోలీస్ శాఖ ఆద్వర్యంలో మాదక ద్రవ్యాల వాడక నిషేదంపై విద్యార్థులకు అవగాహన కల్గించారు. డిఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ నేడు విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తునను నాశనం చేసుకోవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనం నడపకూడదని, అతివేగం ప్రమాధకరం అని, వాహనం నడిపేటప్పుడు ఎడమచేతి వైపు మాత్రమే వెళ్ళాలని, డ్రైవింగ్‌పై మెలకువలను విద్యార్థులకు సూచించారు. యువత డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలతో అనారోగ్య పాలై జీవితం అందకారం అవుతుందని, యువత చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు తీసుకోవడం వలన ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొని బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. లైసెన్స్ లేకుండా ఏ ఒక్కరూ కూడా ద్విచక్రవాహనాలను నడపకూడదని, అలా వాహనాలు నడిపితే చట్టరిత్య నేరం అన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐ త్రినాధ్, ఎస్.ఐ రమేష్, ఎస్.వి.ఎల్ విద్యా సంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు పట్టిసీమ నీటిని అందించాలి

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని పోలవరం కుడికాలువ కింద ఉన్న ఆయకట్టుదారులకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను అందించడానికి వెంటనే ప్రణాళిక తయారు చేయాలని గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు జలవనరులశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సూచనలతో ఈరోజు ఉదయం హనుమాన్ జంక్షన్ పోలవరం కుడి ప్రధాన కాలువ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆరేటి హనుమాయమ్మ, హనుమాన్ జంక్షన్ విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణరావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, రంగన్నగూడెం సర్పంచి కసుకుర్తి రంగామణి, వీరవల్లి సర్పంచ్ పిల్లా అనిత తదితరులతో కూడిన ప్రతినిధి బృందం తొలిత పోలవరం కుడి కాలువ రంగన్నగూడెం గ్రామంలోని 129 కిలోమీటర్ల దగ్గర వెట్టివాగు మీద గతంలో మోటార్లు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించి ఆయకట్టు రైతులతో చర్చించారు. అనంతరం రంగన్నగూడెం ఊర చెరువుకు సాగునీరు వెళ్ళే పాయింటు, ఎస్.ఎస్.పి సబ్ మైనర్ నుంచి సాగునీరు వెళ్లే పాయింటు, తర్వాత రేమల్లె, వేలేరు, వీరవల్లి, కోడూరుపాడు, బండారుగూడెం, అంపాపురం, పల్లెర్లమూడి ఎస్కేపు తదితర ప్రాంతాలను పరిశీలించి సాగునీరు గ్రామాల ఆయకట్టుకు చేరడానికి అవసరమైన మోటార్లు దానికి తగినట్టుగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఒక నివేదికను రూపొందించి గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కు అందచేయుటకు పయనమయ్యారు. ఈ సందర్భంగా రంగన్నగూడెం నుండి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ 2015 నుంచి 2019 వరకు పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు 358 టీఎంసీలు సాగునీరు ఇవ్వటం వలన కృష్ణా డెల్టా రైతులకు 45,000 కోట్లు ఆదాయం రావడమే కాకుండా భారతదేశ జిడిపిలో కృష్ణాజిల్లా రెండవ స్థానంలో నిలిచిందన్నారు. ఒక వారం రోజుల్లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు గన్నవరం ప్రాంతానికి వస్తున్న నేపథ్యంలో పోలవరం కుడికాలువ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులను దృష్టిలో పెట్టుకొని కుడికాలువ కింద ఆయకట్టుకు గోదావరి జలాలను గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట్ల మోటార్ల ద్వారా అందించటానికి గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రంగన్నగూడెం ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, రైతు ప్రముఖులు మొవ్వా శ్రీనివాసరావు, అవిర్నేని భవాని శంకర్, కసుకుర్తి వెంకట శాస్త్రులు, మొవ్వా వేణుగోపాల్, ఆళ్ళ సత్యనారాయణ, మందాడి రవీంద్ర, కసుకుర్తి వెంకట నరసింహారావు, ఆలపాటి శేషగిరిరావు, ఆళ్ల సుధాకర్, కొల్లి సత్యనారాయణ, కలపాల రాధాకృష్ణ, కొండపల్లి వెంకటేశ్వరరావు, ఆర్నేపల్లి సూరిబాబు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొండేటి నాగరాజు, దోనవల్లి శ్రీహరి, జలవనరులశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.గోపీకృష్ణ, షేక్ రహీం, భూలా మెర్సీ, పి. లక్ష్మీ ప్రసన్న, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు యు. మురళీకృష్ణ, ఎ.వి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే..

విశాలాంధ్ర-కూచిపూడి : బాబు పంచాయతీ పరిధిలోని ఐదు అంగన్వాడీ కేంద్రాలలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న 23 మంది విద్యార్థులకు ఒకటవ తరగతిలో చేరేందుకు వీలుగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మొవ్వ లోని జేజే నగర్ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు ప్రతి విద్యార్థిని ప్రాథమిక విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్యా దీవెన ద్వారా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు,ఏక రూపు దుస్తులు, బూట్లు, టైతదితరాదులతో పాటు మధ్యాహ్నం పూట నాణ్యమైన భోజనం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన నిర్వహిస్తారని వీటన్నింటికీ మించి కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దారని పేర్కొంటూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల వైపే దృష్టి సారించాలని కోరారు. అలాగే మూడు సంవత్సరాలు వచ్చినవిద్యార్థులను పూర్వప్రాథమికపాఠశాల (అంగన్వాడి కేంద్రాలు) లోనే జర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా 23 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొవ్వ సెక్టార్ సూపర్వైజర్ ఏనుగు పుణ్యవతి, అంగన్వాడీ కార్యకర్తలు జి. లక్ష్మి, బి. ఝాన్సీ, ఎన్. గోపి, కే నాగమల్లి, ఎం. నాగమల్లేశ్వరి,జె.జె. నగర్ ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి ఐ. శివ పార్వతి, తెలుగుదేశం నాయకుడు శీలం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరు పాఠశాలలో విద్యాకిట్లు పంపిణీ

విశాలాంధ్ర-పమిడిముక్కల: ప్రభుత్వం పంపిణీ చేసే విద్యా కిట్లు తో పాటు తమ వంతు గా విద్యార్థులకు నోట్ బుక్స్ ఇతర తమ గ్రామ పాఠశాలకు పంపిణీ చేసినట్లు వేల్పూరు మాజీ సర్పంచ్ తిరుమలశెట్టి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం వేల్పూరు ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు నోట్ బుక్స్ కిట్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైఎస్ యంపిపి కొడమంచిలి మహేష్ మాట్లాడుతూ తమ గ్రామ పాఠశాల లోని విద్యార్థుల కు ప్రతి సంవత్సరం విద్యకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషం మని ఈ పాఠశాల విద్యార్థులు ఉన్నతి స్థితి వెళ్ళాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.నానిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగునీరు సకాలంలో అందించాలి : యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం : ఖరీఫ్ సాగు ప్రారంభం అవుతున్న వేళ గన్నవరం నియోజకవర్గ పరిధిలోని రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు సకాలంలో సాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాదికారులను యార్లగడ్డ వెంకట్రావు. సోమవారం ఆదేశించారు. పట్టిసీమ కాలువ ద్వారా మెట్ట ప్రాంత భూములకు సాగునీరు అందించేందుకు ఏయే ప్రాంతాల్లో మోటార్లు అవసరమౌతాయో క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పంటకాల్వల పూడికతీత పనులు చాలా కాలంగా పెండింగ్ ఉన్నందున వాటిని వెంటనే బాగుచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. రైతు సంఘాల నేతలు, ఇరిగేషన్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొల్లిశెట్టికి సురేష్ అభినందనలు

విశాలాంధ్ర-గుడివాడ : తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొల్లిశెట్టి శ్రీనివాసరావుని మర్యాద పూర్వకంగా మంగళవారం విజయవాడ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యాలయంలో మాజీ మన్సిపల్ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వర రావు కుమారుడు వెంకటసురేషబాబు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలు అభివృద్ధి కొరకు, వారి హక్కుల కొరకు నిరంతరం పోరాటం చేస్తానన్నారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బంది ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తాతన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం టిడిపి నాయకులు కఠారి ఉమామహేశ్వరరావు ఎన్ఆర్ఐ కిలారు భానుప్రసాద్, మాట్టా తిరుపతిరావు మాట్టా గోపి, శీలం బ్రహ్మయ్య, శీలం వరబాబు పాల్గొన్నారు.

డ్రగ్స్, ర్యాగింగ్‌పై అవగాహన

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ లో గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ ముఖ్య అతిథిగా విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ మరియు యాంటీ ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొలుత గుడివాడ రూరల్ సీఐ కె.ఏసుబాబు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో సమాజంలో వచ్చే దుష్పరిణామాలు మరియు ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కావున విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు. అనంతరం గుడివాడ డి.ఎస్.పి శ్రీ పి. శ్రీకాంత్ మాట్లాడుతూ ఎలాంటి పదార్థాలు డ్రగ్స్ కిందకి వస్తాయి? వాటికి విద్యార్థులు ఏ విధంగా ఆకర్షితులు అవుతారు? అనే అంశాల గురించి విపులంగా వివరించారు. యువత దేశానికి పట్టు కొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు మరియు సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలిపారు. విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పాటించవలసిన రహదారి నియమ నిబంధనలను విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ సీఐ కె. ఏసుబాబు, గుడ్లవల్లేరు ఎస్సై జి. సత్యనారాయణ ఇతర పోలీస్ సిబ్బంది, గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీ ఎస్.రాజశేఖర్, విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రులను కోరిన ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ, ఎక్సైజ్, విద్యుత్ శాఖలో పని చేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించి రాజకీయ కారణాలతో అర్ధాంతరంగా తొలగించే విధానాన్ని ఆపాలని, శిక్ష అభియాన్ కార్మికులకు మినిమం టైమ్స్ స్కెల్ వర్తింప చేయాలనీ సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రభుత్వం కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలను ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు ఎం.రమేష్‌బాబు, బాలాకాశిలు మంగళవారం అమరావతి సచివాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సంవత్సరాలుగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ స్కావేంజర్స్,మోడల్ స్కూల్ హాస్టల్స్ వర్కర్స్ తదితర మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అభ్యంతరంగా తొలగించే విధానాన్ని అధికట్టాలని వారు కోరారు.. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 134 మోడల్ స్కూల్ హాస్టల్ లో వర్క్ చేస్తున్న చెప్పిందని రెగ్యులర్ చేయాలని పార్ట్ టైం వర్కర్స్ కి ఉద్యోగ బద్రత కల్పించాలని వారు కోరారు.. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రవ్యాప్తంగా బేవారేజస్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలపై దృష్టికి అంగీకరించాలని వారు కోరారు.. ప్రభుత్వంలో పెట్టిన ఇబ్బందులు ఈ ప్రభుత్వంలో లేకుండా ప్రభుత్వం చూడాలని వారు మంత్రులను కోరారు. విద్యుత్ మీటర్ రీడర్స్ మరియు సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర నాయకులు శివారెడ్డి, విజయ్, రామకృష్ణ, మోహన్ రెడ్డి, స్వాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.వేలకోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై

సీబీఐ విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా వేలకోట్ల టిడిఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని ఆనాటి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, అప్పటి ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారని సమతా సైనిక రాష్ట్ర అధ్యక్షులు పాలేటి మహేశ్వర్ రావు తెలిపారు.మంగళవారం సమతాసైనిక్ దళ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలను అడ్డాగా చేసుకొని టిడిఆర్ బాండ్ల కుంభకోణం చేపట్టారని అనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పటి రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సి.ఎం.ఓ లో ఉన్న ధనుంజయ రెడ్డి వీరు ముగ్గురు వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.ప్రజలు తమ ఇంటి నిర్మాణాల కోసం కొన్ని ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న కట్టడాలు క్రమబద్ధకరించుకునేందుకు టిడిఆర్ బాండ్లు వీరి వద్ద నుంచి కొనుగోలు చేశారన్నారు.ఆనాటి మంత్రి కారుమూరికి బినామీగా ఉన్న పులుపు అనిల్ కుమార్ ఈ కుంభకోణంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు.అప్పట్లో ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ నామమాత్రంగా చేయించి అనిల్ బుట్ట దాఖలు చేయించారని స్పష్టం చేశారు.ఈ భారీ కుంభకోణంలో వేల కోట్లు చేతులు మారాయని సిబిఐ, ఈడి విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కుంభకోణానికి సంబంధించి పూర్తి ఆధారాలతో రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేస్తామన్నారు.ఈ విలేకరుల సమావేశంలో సమతా సైనిక్ దళ నేతలు సురేంద్రబాబు,శ్వేత తదితరులు పాల్గొన్నారు.

అద్భుతమైన మ్యూజిక్ ఫ్రేమ్‌ను ప్రారంభించిన శామ్‌సంగ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, భారతదేశంలో తన మ్యూజిక్ ఫ్రేమ్‌ను ఆవిష్కరించింది. వైర్‌లెస్ స్పీకర్ ఒక కళాఖండం వలె కనిపిస్తుంది ఈ మ్యూజిక్ ఫ్రేమ్ డాల్బీ అట్మోస్, వైర్‌లెస్ మ్యూజిక్ స్ట్రీమింగ్ వంటి కొత్త ఫీచర్‌లతో కేవలం రూ.23,990 వద్దలభిస్తుంది. స్టైలిష్ వైర్‌లెస్ స్పీకర్ ను పిక్చర్ ఫ్రేమ్‌గా చేయడం ద్వారా మునుపెన్నడూ లేని విధంగా లివింగ్ రూమ్‌లో చక్కగా సరిపోతుంది. నిజమైన ఫ్రేమ్ వలె శామ్‌సంగ్ మ్యూజిక్ ఫ్రేమ్, వినియోగదారులు వారి ఫోటోలను పెట్టుకునే గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది. విలువైన జ్ఞాపకం లేదా కళాఖండం యొక్క ఫ్రేమ్డ్ ఫొటోను చూస్తూ సంగీతాన్ని వినడం వినియోగదారుల అనుభవాలకు కొత్త స్థాయిలను జోడిస్తుంది.

ప్రభుత్వ ఆకాంక్షల మేరకు సేవలు

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించి.. రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనించేలా సమష్టిగా కృషిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం మంత్రి కొలుసు పార్థసారథిని నగరంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు కృషిచేయాలన్నారు. సంక్షేమం-అభివృద్ధి తారకమంత్రంగా తొలిరోజు నుంచి ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు 100 శాతం ప్రజలకు చేరువయ్యేలా చేయడం కోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వంలో భాగమైన వివిధ విభాగాలు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా విధులను నిర్వహించడం ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు.

రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలను, పరిపాలన విధానాన్ని ఉద్యోగులందరూ ప్రత్యక్షంగా పరిశీలించారని గుర్తు చేశారు. రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రం దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలంటే ఉద్యోగుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి రావలసిన ప్రతి ప్రయోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఉద్యోగి సంతోషంగా విధులు నిర్వహించేలా, సంతృప్తికర స్థాయిలో ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. వివిధ విభాగాల ఉద్యోగ సంఘాల నాయకులు కూడా తమ తమ సంఘాల సమావేశాల్లో ఇదే విషయాన్ని అందరికీ తెలియజేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ప్రతి ఉద్యోగి భవిష్యత్తు తరాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అండగా నిలవాలన్నారు. ఒకవైపు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ మరోవైపు రాష్ట్రాన్ని సామాజికంగా, పారిశ్రామికంగా, ఆర్థికంగా ప్రగతి బాటలో పయనించేలా చేసి దేశంలో అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు సమష్టి కృషి అవసరమని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మంత్రి పార్థసారథిని కలిసిన వారిలో కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. రమేష్ , కోశాధికారి వి. సతీష్, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి దిలీప్, శివలీల, నగర శాఖ అధ్యక్షుడు సివిఆర్ ప్రసాద్, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. రాజశేఖర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ పి. మధుసూదన రావు, వైస్ ప్రెసిడెంట్ కేసర్ గణేష్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు మాచిరాజు అక్కిరాజు, నాలుగవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. చంద్రశేఖర్, సహాధ్యక్షులు పి సాయిరాం తదితరులతోపాటు జేఏసీలో భాగమైన నాయకులు ఉన్నారు.

డయేరియా ప్రబలకుండా

ముందస్తు చర్యలు

విశాలాంధ్ర-వీరులపాడు: గ్రామంలో డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలలో భాగంగా జుజ్జూరు గ్రామపంచాయితీ పరిధిలో మంగళవారం శానిటేషన్ పనులు చేపట్టారు. వీరులపాడు మండల జుజ్జూరు గ్రామ సర్పంచ్ రమావత్ కోటి ఆద్వర్యంలో జుజ్జూరు,రంగాపురం గ్రామాలలోని 4 ఓవర్ హెడ్ ట్యాంక్ లను శుభ్రపరిచారు. గ్రామంలోని మురుగునీటి కాలువలలో, మురుగు నీరు నిల్వ వుండే చోట బ్లీచింగ్ చల్లారు. గ్రామ శివారులలో చెత్త-చెదారం ఉండటాన్ని కొంతమంది గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. శుభ్రం చేసిన తర్వాత ప్రతిసారి మళ్ళీ అక్కడే చెత్త వేస్తున్నారని, ఇకపై వారికి నోటీసులు అందజేసి తగిన చర్యలు తీసుకుంటామని జుజ్జూరు గ్రామ పంచాయితీ కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-తిరువూరు: ఆంజనేయపురం గ్రామ ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఆంజనేయపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మామిడి గాంధీ,తిరువూరు టిఎన్టియుసి అధ్యక్షులు తుమ్మలపల్లి పుల్లారావు, తెలుగు యువత అధ్యక్షులు బాలమర్తి వెంకటేశ్వరావు,ఐ టీ డి పి గ్రామ అధ్యక్షులు వలపనబోయిన రమేష్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు మామిడి రవి,సీనియర్ నాయకులు నాగరాజు, జవాజి పూర్ణయ్య, యటరామకృష్ణ,షేక్ జానీ,జనసేన నాయకులు బొజ్జూర్ నాగేంద్రబాబు, పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సంగసాని వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త వెంపాటి రాంబాబు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిన్నాభిన్నం : ఎస్ఐ సందీప్

విశాలాంధ్ర-కంకిపాడు : మండలంలోని ఈడుపుగల్లు హైస్కూల్‌లో మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. స్థానిక ఎస్సై సందీప్ మాట్లాడుతూ నేటి యువత మాద ద్రవ్యాలకు ఆకర్షణై చెడు వ్యసనాలకు బానిసై బంగారం లాంటి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలు వాడకం వలన మీ కుటుంబ సభ్యులు ఎంత బాధకు గురవుతున్నారో అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సరదగా చేసుకునే అలవాటు మానలేని విధంగా మారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందనన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేకపోతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శరవేగంగా రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : గ్రాండ్ ట్రంక్ మార్గంలో ఉన్న నెల్లూరు రైల్వే స్టేషన్, రైలు వినియోగదారుల భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి, సొగసైన ఫీచర్లతో ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించడానికి ఈ.పి.సీ విధానంలో దక్షిణ మధ్య రైల్వే ద్వారా పునరాభివృద్ధి చేయబడుతోంది.ఆగస్టు 2022లో ఈ.పి.సీ విధానంలో మెసర్స్ ఎస్‌సీఎల్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ పునరాభివృద్ధిలో భాగంగా పశ్చిమం వైపు కొత్త భవనాన్ని (గ్రౌండ్ 3అంతస్తుల)తో నిర్మిస్తుండగా తూర్పు వైపున (గ్రౌండ్ 3)అంతస్తులు,ఉత్తరం వైపు(గ్రౌండ్ 2) అంతస్తులతో ప్రస్తుతం ఉన్న భవనాలు రైలు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విస్తరిస్తున్నారు.దానితో పాటు భవనాల పునరుద్ధరణ,ముఖభాగాల మెరుగుదలలు కూడా చేపట్టబడుతున్నాయి. స్టేషన్ పునరాభివృద్ధిలోని మొదటి దశలో భాగంగా సైట్ కార్యాలయాల ఏర్పాటు, కాంక్రీట్ టెస్టింగ్ ల్యాబ్, మెటీరియల్‌లను పేర్చడానికి నిల్వ షెడ్‌లు, రైల్వేకోర్టు,గవర్నమెంట్ పోలీస్ వారి కార్యాలయాల కొరకు తాత్కాలిక షెడ్‌ల నిర్మాణం పూర్తయింది. తూర్పు, పడమర,ఉత్తరం వైపు స్టేషన్ భవనాల ఫ్రేమ్డ్ నిర్మాణం పూర్తిఅయ్యి తాపీపని మాత్రమే పురోగతిలో ఉంది. తూర్పు వైపు మరియు పడమర వైపు భవనాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.పునరాభివృద్ధి చేయబడిన స్టేషన్‌లో 36 మీటర్ల వెడల్పు గల ఎయిర్‌కోర్సు కూడా ఉంటుంది. దీని ప్రకారం, ఎయిర్ కాన్కోర్స్ సంబంధిత నిర్మాణ పనులు డెక్ స్థాయి వరకు పూర్తయ్యాయి,ఇందులో గర్డర్‌లు,క్రాస్ గిర్డర్‌లను ప్రారంభించడం కూడా జరిగింది. వర్టికల్ కాలమ్ లాంచింగ్,డెక్ స్లాబ్‌పై కాంక్రీట్ ఫ్లోరింగ్ యొక్క 100% కాస్టింగ్ పూర్తయ్యాయి.పదకొండు ట్రస్సులలో ఆరు ప్రారంభించబడ్డాయి.సబ్‌వే పొడిగింపుకు సంబంధించి, సబ్ వే పొడిగింపులో 85% పూర్తయింది.తదుపరి పని పురోగతిలో ఉంది.అగ్నిమాపక పైప్ లైన్ ఏర్పాటు పూర్తి అయ్యి, సబ్‌వేలో గ్రానైట్ ఫ్లోరింగ్ పురోగతిలో ఉంది.ఇతర పనులకు సంబంధించి, అన్ని ప్లాట్‌ఫారమ్‌లలో ప్లాట్‌ఫారమ్‌ల స్టాంచ్‌లపై కవర్‌ను ఏర్పాటు చేయడం మరియు 90% గాల్వాల్యూమ్ షీట్ పనులు పూర్తయ్యాయి. ఏకకాలంలో పర్మినెంట్ కోర్టు భవనం నిర్మాణం, 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్, 870 కిలో లీటర్ల మురుగునీటి శుద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ స్టేషన్ పునరాభివృద్ధి పనులు, సకాలంలో పూర్తి చేసేందుకు ప్రతి దశలోనూ నిశితంగా అమలు చేయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రైలు వినియోగదారులకు కనీస అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని భద్రతా జాగ్రత్తలు తీసుకొని పనులను నిర్వహించాలని ఆయన ప్రాజెక్ట్ బృందాన్ని ఆదేశించారు.పునరాభివృద్ధి చేయబడిన స్టేషన్ విశాలమైన వేచియుండు ప్రాంగణాలు, అత్యాధునిక డిజిటల్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లేలు, అధునాతన భద్రతా వ్యవస్థలు, పర్యావరణ హిత భవనాలు మొదలైన వాటితో సహా ప్రయాణీకుల అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన ఆధునిక సౌకర్యాల శ్రేణిని కలిగి ఉంటుందన్నారు.

లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : లోకో రన్నింగ్ ఉద్యోగుల దీర్ఘకాలకంగా ఉన్న అనేక సమస్యలను తక్షణం రిష్కరించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజనల్ అధ్యక్షులు ఎమ్.వెంకటేష్‌న్ సెక్రటరీ కె.రామకృష్ణ డిమాండ్ చేశారు.ఈనెల 1 నుండి దక్షిణ రైల్వే ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాప్ అసోసియేషన్ చేస్తున్న ఆందోళనకు మద్దతుగా మంగళవారం రన్నింగ్ స్టాఫ్ కుటుంబాలతో కలసి రైల్వే ఇనిస్యూట్‌లో ఒక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ భారతీయ రైల్వేలో అందరి కార్మికులకు ఇచ్చినట్టుగా రన్నింగ్ సిబ్బందికి కూడా (16+30) వారాంతపు విశ్రాంతిని ఇవ్వాలన్నారు.రన్నింగ్ స్టాఫ్ విధులను 8 గంటలకు పరిమితం చేయాలన్నారు.రాత్రి డ్యూటీలను వరుసగా రెండు రాత్రులకు పరిమితం చేయాలి,హెడ్ క్వార్టర్ నుంచి బయలుదేరిన రన్నింగ్ స్టాప్‌ను 48 గంటల లోపలనే తిరిగి తీసుకొని రావాలన్నారు.రన్నింగ్ స్టాప్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్నారు.రన్నింగ్ స్టాప్ తమ సామాజిక జీవితాన్ని కోల్పోయి వారాంతపు విశ్రాంతి లేకుండా పనిలో భద్రత కరువై డ్యూటీలు చేస్తున్నారన్నారు. తమ సమస్యలను తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి,విజవాడ,బిట్రగుంట,కృష్ణపట్నంలో విధులు నిర్వహిస్తున్న రన్నింగ్ స్టాప్ పాల్గొన్నారు.

నున్న జడ్పీ హైస్కూల్‌లో షెడ్ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ రూరల్ మండలం నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షెడ్ నిర్మాణానికి పాఠశాల పూర్వ విద్యార్థి (1988-89 పదో తరగతి బ్యాచ్), ఎన్ఆర్ఐ భీమవరపు శివారెడ్డి రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. అమెరికాలో నివాసం ఉంటున్న శివారెడ్డి ఇటీవల కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామం నున్న వచ్చారు. ఈ సందర్భంగా ఆయన నున్న హైస్కూల్‌ను సందర్శించి, పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో తాను కూడా భాగస్వామ్యంకావాలనే ఉద్దేశంతో నూతనంగా నిర్మించనున్న షెడ్ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అందుకు సంబంధించిన చెక్కును పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి నరెడ్ల సత్యనారాయణరెడ్డితో కలసి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు భూపాల్‌రెడ్డికి అందజేశారు. ఎన్ఆర్ఐ శివారెడ్డి సతీమణి బీహెచ్ సుధారాణి కూడా ఇదే పాఠశాల విద్యార్థిని కావడం విశేషం. చెక్కును అందించిన అనంతరం ఆయన పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన సైన్స్ లేబోరేటరీ, సైకిల్ స్టాండ్, అదనపు తరగతి గదులు, డైనింగ్ కమ్ మీటింగ్ హాల్, పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. తనతోపాటు అమెరికాలో స్థిరపడిన పాఠశాల పూర్వ విద్యార్థులను అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. కాగా, పాఠశాల చరిత్రలో తొలిసారిగా 11 మంది విద్యార్థులు స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి పోటీలలో పాల్గనొడంపై వ్యాయామ ఉపాధ్యాయులు విజయ వర్మ, శ్రీలతను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే 'వర్ల' విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-పమిడిముక్కల: పామర్రు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వర్ల కుమార రాజా విజయేత్సవ ర్యాలీ భాజా భజంత్రీలతో మంటాడ నుండి లంకపల్లి వరకు నిర్వహించారు.మంగళవారం ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పామర్రు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే గా వర్ల కుమార రాజా గెలుపొందటంతో ఆయనికి తేదేపా,జనసేన నాయకులు కార్యకర్తలు తో జోడు గుర్రాల రథంలో వర్ల మంటాడ శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయం కి వెళ్లి ఆలయ అధికారులు స్వాగతించి ప్రత్యేక పూజలు చేసి ఘనంగా సన్మానించారు .అభిమానులు మహిళలు భారీ సంఖ్యలో అభినందన ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం నాయకులు తో పాటు జనసేన నాయకులు తాడిశెట్టి నరేష్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

విశాలాంధ్ర-చల్లపల్లి : స్థానిక నారాయణ రావు నగర్ కాలనీలోని ఏకలవ్య విగ్రహ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఒంటినిట్టాడి పూరిల్లు పూర్తిస్థాయిలో అగ్నికి ఆహుతైంది. గరికపాటి యశోదకు చెందిన గృహం పూర్తిగా దగ్ధం కాగా, ఇంటిలోని గృహోపకరణాలు, బీరువాలోని నగదు, ల్యాప్టాప్,వస్తుసామాగ్రి పూర్తిగా దగ్ధమవటంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. భోజనం చేసి నిద్రిస్తున్నసమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో ఇంటిలోని వారంతా బయటకు వచ్చారు. యశోద తండ్రికట్టా బోసుకు మంటల వేడిమికి చేతుల పై స్వల్పంగా బొబ్బలెక్కాయి. మంటలు ఎగిసిపడి పెద్ద ఎత్తున పొగరావటంతో చుట్టుపక్కన యువకులు భారీగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మొవ్వ అగ్నిమాపక అధికారులు ఫైరింజన్తో వచ్చి మంటలు పూర్తిగా అదుపుచేశారు. పక్కనే ఉన్న కుంభా నాగేశ్వరమ్మ ఇల్లు స్వల్పంగా దెబ్బతింది. కొబ్బరి చెక్కలతో చేసిన గోడలకు మంటలు అంటుకోగా మంటలు ఇల్లంతాటుకోకుండా కాపాడేందుకు వాటిని పడగొట్టారు. చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శిపివి. మాధవేంద్ర రావు, శానిటరీ ఇనెస్పెక్టర్ సుధాకర్లు సంఘటనా ప్రదేశానికి చేరుకుని సహాయక చర్యలనుపర్యవేక్షించారు. కానిస్టేబుల్ శివాజీ మంటలను ఆర్పేందుకు సాయపడ్డారు. వీఆర్వో బేబి ప్రమాదనష్టం అంచనావేసి తహసీల్దారు నివేదించారు. విద్యుత్త్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందనిభావిస్తున్నారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేనినాని సాయమందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి తనవంతు సాయంగా బియ్యం, నిత్యావసర సరకులు, దుప్పట్లు, నగదును యశోదకు అందచేశారు. దాతల నుంచీ సహాయం అందేలా కృషిచేస్తానని తెలిపారు.

రాయితీపై సబ్సిడీ విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-పెడన : ఈ సీజన్లో రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జరిగిన ఇన్పుట్ సబ్సిడీ పంపిణీలో అక్రమాలు తప్పిదాలను తిరిగి పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధ్యులను నిర్ధారించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు..ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.అధికారులు రైతులకు పూర్తిగా అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నందిగామ సర్పంచ్ బొడ్డు సీతయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనే కార్యక్రమాల్లో పారిశుద్ధ్యం నిర్వహించే బాధ్యత లేదా అని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు పై ఆగ్రహం వ్యక్తం చేశారుఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుడిసేవ రామారావు మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ పట్టణ టిడిపి అధ్యక్షుడుయక్కల. శ్యామలయ్య,పరసా రాంబాబు చెన్నూరు శేఖర్ బొడ్డు చినబాబు గంధం గోపాలకృష్ణ పంద్రాజు హరిబాబు పంద్రాజు లక్ష్మణరావు జనసేన పార్టీ నాయకుడు ఊచా.వెంకయ్య సొంటి రాము పరసా చిన్నా కన్నె పోటీ సాయి కిరణ్ అనగాని అంకాలరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగల అరెస్టు

విశాలాంధ్ర-కంకిపాడు : మండలంలోని ఈడుపుగల్లు లో ఈ నెల 22వ తేదీన బైక్ పోయినదని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై సందీప్,అదనపు ఎస్సై తాతాచార్యులు చేపట్టిన దర్యాప్తులో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఈడుపుగల్లు శివారులో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరిది కనుమూరు గ్రామానికి చెందిన మల్లాడ వంశీ, మరొ వ్యక్తి పెనమలూరు మండలం చిన్న గోసాలకు చెందిన మైనర్ బాలుడిగా గుర్తించారు. వీరిని విచారించగా చెడు వ్యసనాలకు బానిసై ఈడుపుగల్లు, కంకిపాడు, పునాదిపాడు, పెనమలూరు గ్రామాల్లో నాలుగు బైక్‌లు దొంగిలించినట్లు తెలింది. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.